క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు



చీమలమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అప్సర్

చీమకుర్తి రూరల్: మండలంలోని మంచికల పాడు సచివాలయ పరిధి చీమలమర్రి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు, గ్రామస్తులకు బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అప్సర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి మొహం పై తెల్లని మచ్చలు రావడానికి విటమిన్ లోపమని తెలిపారు. వాటి నివారణకు మంచి పౌష్టిక ఆహారం, ఆకుకూరలు తీసుకోవాలని తెలిపి వైద్యపరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రయంలో ఏఎస్ఎం మేరీ, ఆశావర్కర్, అంగన్‌వాడీ టీచర్, బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

సంతనూతలపాడు: మండలంలో ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంతనూతలపాడు పశు వైద్యాధికారులు డాక్టర్ బి.ప్రతాప్ రెడ్డి, డాక్టర్ పీ చిరంజీవి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆవులు, గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను, గొర్రెలు, మేకలకు బొబ్బ వ్యాధి రాకుండా టీకాలు వేస్తారని తెలిపారు. పశువులకు వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పశువైద్య బృందం మండలంలో రోజుకు రెండు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీన గురువారెడ్డి పాలెం, యం.వేములపాడు గ్రామాలు, 23న చంద్రపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లో, 24న రుద్రవరం, చిలకపాడు గ్రామాల్లో, 25న ఎనికపాడు, ఎండ్లూరు గ్రామాల్లో, 27న గుమ్మలంపాడు, పీ తక్కెళ్లపాడు గ్రామాల్లో, 28న మైనంపాడు గ్రామంలో, 29న మద్దులూరు, మంగమూరు గ్రామాల్లో, 30న కొనగానివారిపాలెం, 31న పి.గుడిపాడు గ్రామంలో ఈ ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారులు ప్రతాపరెడ్డి, చిరంజీవి పేర్కొన్నారు.

ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలి



రామచంద్రాపురంలో రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్

చీమకుర్తి రూరల్: మండలంలోని రామచంద్రాపురం గ్రామ సచివాలయ పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించిన మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ పంట వేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకుంటే కలిగే ప్రయోజనాలు వివరించారు. మంగళవారం రామచంద్రాపురం గ్రామ పొలాలను సందర్శించి వరిపంట పొగాకును పరిశీలించి రైతులకు వరిపంటలో తెల్లదోమ నివారణకు ఇమిడా క్లోప్రిడ్ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం ఉత్తిదేనా..!

- ఎన్నికల హామీ అమలు చేయకపోవడంపై మహిళల అసహనం
- అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా అతీగతీ లేదంటూ విమర్శలు
- చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మి ఓట్లేసి మోసపోయామంటూ గగ్గోలు
- నియోజకవర్గంలో దాదాపు 1.30 లక్షల మంది మహిళలు



సంతనూతలపాడు: ఏరు దాటేదాక ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లుంది కూటమి ప్రభుత్వ పాలకుల తీరు. ఎన్నికల సమయంలో సూపర్6 హామీలంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు దాటినా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. సూపర్6 లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అటకెక్కించడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల వేళ ఊదరగొట్టిన కూటమి నాయకులు.. ప్రసుత్తం దాని గురించి ఏమీ మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఉత్తిదేనా చంద్రబాబు అంటూ ప్రశ్నిస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో దాదాపు 1,30,000 మంది మహిళలు ఉన్నారు. ఇందులో సంతనూతలపాడు మండలంలో 31,459, మద్దిపాడు మండలంలో 30,387, నాగులుప్పలపాడు మండలంలో 33,687, చీమకుర్తి మండలంలో 34,287 మంది మహిళలు ఉన్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీ అమలు చేస్తే వీరందరికీ లబ్ధి చేకూరే అవకాశం ఉంది. కానీ ఎన్నికల సమయంలో కేవలం మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చిన కూటమి నాయకులు... ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేయకుండా జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ప్రజలు వివిధ పనులు, కాలేజీలు, ఆస్పత్రులు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి నిత్యం మండల కేంద్రాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత బస్సు హామీ అమలు చేయకపోవడంతో తామంతా నష్టపోతున్నామని మండిపడుతున్నారు.

కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని అమలు చేశాయి. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తే మహిళలకు కొంత మేర ఊరట కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

– తన్నీరు రాగమ్మ, వైస్ ఎంపీపీ, సంతనూతలపాడు

గ్రామీణ మహిళలే అధికం

సంతనూతలపాడు మండలంలో అధిక సంఖ్యలో మహిళలు గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేస్తే వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ హామీ ఇచ్చేటప్పుడు అమలు చేయగలమా లేదా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధపు హామీలిచ్చి సీఎం పీఠంపై కూర్చున్న తరువాత ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తుందంటే ఎలా? ఉచిత బస్సు ప్రయాణం తక్షణమే అమలు చేయాలి.

– కుంచాల రమణమ్మ, సంతనూతలపాడు

మండవ అప్పారావుకు బూచేపల్లి పరామర్శ



మండవ అప్పారావును పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దుంపా చెంచిరెడ్డి తదితరులు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు ఇటీవల ప్రమాదానికి గురై ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయనను మంగళవారం మధ్యాహ్నం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకొని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సంతనూతలపాడు పార్టీ అధ్యక్షుడు దుంప చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంప రమణమ్మ, సీనియర్ నాయకులు శ్రీధర్ బాబు, మద్దిపాడు మండల పార్టీ కార్యదర్శి వాకా కోటిరెడ్డి, పాకనాటి మహానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలను అలరించిన చీమకుర్తి నాగేశ్వరరావు



చీమకుర్తి నాగేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న డాక్టర్ బీ.జవహర్, బదరీనారాయణ తదితరులు

చీమకుర్తి: సత్యహరిశ్చంద్రుడిగా పేరుగాంచిన చీమకుర్తి నాగేశ్వరరావు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలను అలరించారని లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ.జవహర్, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు అన్నారు. చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తి పక్కనే ఉన్న అగ్రహారం గ్రామానికి చెందిన తొట్టెంపూడి నాగేశ్వరరావు సత్య హరిశ్చంద్రుడి నాటకంలో సత్యహరిశ్చంద్రుడి పాత్రలో వేలాది ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారని గుర్తు చేసుకున్నారు. దూర ప్రాంతాల్లో నాటకాన్ని ప్రదర్శించే సమయంలో ఎవరీ నాగేశ్వరరావు అంటే చీమకుర్తి అని చెప్పటం ద్వారా చివరకు తొట్టెంపూడి నాగేశ్వరరావు పేరు కాస్త చీమకుర్తి నాగేశ్వరరావుగా పేరు గాంచినట్లు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, బండ్ల డేవిడ్, చీమకుర్తి నాగేశ్వరరావు కుమారుడు శ్రీనివాసరావు, వైఎస్ భారతి సేవాసమితి అధ్యక్షురాలు పాటిబండ్ల రాజ సులోచన, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, అగ్రహారం గ్రామస్థులు, ఇస్తర్ల శంకర్, చింతలపాలెం బాబు, షేక్ ఖాదర్‌భాషా, పిన్నిక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్సిడీ యూనిట్లకు దరఖాస్తు ప్రక్రియ వాయిదా

సంతనూతలపాడు: మండలంలో బీసీ, ఈడబ్ల్యూఎస్ 2024–25 యాక్షన్ ప్లాన్ కు సంబంధించి అర్హులైన లబ్ధిదారులు సబ్సిడీతో ఆయా యూనిట్లు పొందడానికి ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని తొలుత తెలిపారని కానీ సాంకేతిక కారణాలతో దరఖాస్తుల కార్యక్రమం వాయిదా పడిందని ఎంపీడీవో డీ సురేష్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓబీ ఎంఎంఎస్ పోర్టల్ అందుబాటులోకి రాలేదని, త్వరలోనే సాంకేతిక కారణాలను అధిగమించి దరఖాస్తు తేదీని లబ్ధిదారులకు తెలియపరుస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా మన్నం

ఒంగోలు వన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా మన్నం ప్రసన్నరాజును నియమిస్తూ ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్ ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా ఒంగోలు డీసీసీ కార్యాలయంలో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు ఎస్‌కే సైదా నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పి.విజేష్ రాజ్, కె.వెంకటకృష్ణారెడ్డి, విజేంద్ర పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఒంగోలు టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 99592 25695 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

కూలీలను తరలించేటప్పుడు జాగ్రత్త వహించాలి



రైతులు, వాహనాల యజమానులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

నాగులుప్పలపాడు: వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం నాగులుప్పలపాడులో రైతులు, వాహనాల యజమానులతో అయన మాట్లాడారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో విరివిగా పొగాకు పనులు, కలుపులు, కాయ కోతల వంటి వ్యవసాయ పనులు జరుగుతునాయని ఆయా పనులకు కూలీలను తరలించేటప్పుడు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

పీఎం అవార్డ్స్ కోసం వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: పీఎం అవార్డ్స్ కోసం తగిన ప్రతిపాదనలతో వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. మంగళవారం ప్రకాశం భవనంలో సంబంధిత శాఖల అధికారులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరు తమీమ్ అన్సారియా మాట్లాడుతూ 2022 ఏప్రిల్ నుంచి 2024 డిసెంబర్ నెలాఖరు వరకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదికలను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పీఎం అవార్డుల కోసం మొత్తం మూడు కేటగిరీల్లో 14 అంశాలకు సంబంధించిన వివరాలు సైట్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. హర్ ఘర్ జల్ యోజన, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, పీఎం విశ్వకర్మ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం స్వానిధి, సక్షం అంగన్వాడీ, పోషణ అభియాన్, ప్రధానమంత్రి మాతృవందన యోజన, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన, మిషన్ ఇంద్ర ధనస్సు, రైతులు, మత్స్యకారులు, పశుపోషకులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పథకం అమలు చేస్తున్న వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సవివరంగా తెలియజేయాలని ఆదేశించారు. యాస్పిరేషనల్ బ్లాక్ అభివృద్ధి కింద ఎర్రగొండపాలెం ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను, వినూత్న కార్యక్రమాల కింద జిల్లాలో అమలు చేస్తున్న బంగారు బాల్యం మార్గదర్శిని కార్యక్రమాలను కూడా సమగ్రంగా నివేదించాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ హేమంత్, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పశు సంవర్థక అధికారి బేబిరాణి, డీఈఓ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ హేన సుజన్, ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, విపత్తుల నిర్వహణ విభాగం డీపీఎం మాధురి పాల్గొన్నారు.

వయోజనులకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

- ఎంపీడీవో జ్యోతి



వయోజన విద్య అభ్యసన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో జ్యోతి తదితరులు

మద్దిపాడు: వయోజనులకు ఆర్థిక అక్షరాస్యత చాలా ముఖ్యమని ఎంపీడీవో వి.జ్యోతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) జిల్లా సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద బోధకుల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. స్వచ్ఛంద బోధకులు ఒక్కొక్కరు పదిమంది నిరక్షరాస్యులను, అక్షరాస్యులుగా మార్చాలని అన్నారు. స్వచ్ఛంద బోధకులు అందరికీ అనువైన పాఠశాల గానీ, అంగన్‌వాడీ సెంటర్ కానీ, కమ్యూనిటీ సెంటర్ కానీ అక్షర్ కేంద్రంగా మలుచుకోవాలని సూచించారు. వాచకం లోని పాఠాలు స్త్రీలు నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలను ఎదుర్కొనేలా ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా వయోజన విద్య సూపర్‌వైజర్ పోతురాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలకు డిజిటల్, ఆర్థిక, క్రియాత్మక అక్షరాస్యత అందించటమే ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. టీసీఎస్ కంపెనీ వారు సామాజిక బాధ్యతతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించారని, వారు రూపొందించిన వీడియో పాఠాలు రోజుకొక వీడియో పాఠం అభ్యాసకులకు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట ఏపీఎం కాకుమాను సుబ్బారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్వచ్ఛంద బోధకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ ఓటర్ల దినోత్సవం లో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్ఎస్‌పాడు స్పెషల్ ఆఫీసర్ ఎస్ వరకుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదివి అన్ని రంగాల్లో రాణించాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 20వ తేదీ చీమకుర్తి, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు కేంద్రాల్లో ఆయా మండలాల స్థాయిలో పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలైన టీములకు మంగళవారం హైస్కూల్ ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఈనెల 23న ఒంగోలులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని చిలకపాడు హైస్కూల్ కు చెందిన విద్యార్థులైన కె.శ్రావ్య, మల్లికా ప్రియా, లిఖిత గెలుపొందారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో మైనంపాడు హైస్కూల్ కు చెందిన విద్యార్థిని ఎస్‌కే తస్లీమ, ద్వితీయ స్థానంలో చిలకపాడు హైస్కూల్ కు చెందిన విద్యార్థిని కె.శ్రావ్య, తృతీయ స్థానంలో సంతనూతలపాడు హైస్కూల్ కు చెందిన ప్రియాంక గెలుపొందారు. వ్యాసరచన పోటీల్లో చిలకపాడు హైస్కూల్ కు చెందిన పీ మల్లికా ప్రియ ప్రథమ స్థానాన్ని, మైనంపాడు హై స్కూల్ కు చెందిన జి.రేమాషణ్ ద్వితీయ స్థానం, చీమకుర్తి హైస్కూల్ కు చెందిన జి.సుమిత్ర తృతీయ స్థానం సాధించారు. విజేతలకు సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీమకుర్తి తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, సంతనూతలపాడు నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ డీ అరుణ, సంతనూతలపాడు, చిలకపాడు హైస్కూలు ప్రధానోపాధ్యాయులు ఎం ప్రమోద, పి స్వప్న రాజు, హైస్కూల్ పీడీ కే మల్లికా రాణి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం షాపుల ఆకస్మిక తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..



మద్యం షాపులను తనిఖీ చేస్తున్న చీమకుర్తి ఎక్సైజ్ సీఐ ఎం.సుకన్య

సంతనూతలపాడు: నియోజకవర్గంలో మద్యం వ్యాపారులు ఇష్టానుసారంగా మద్యం విక్రయాలు సాగిస్తుండటంపై 'విచ్చలవిడి మద్యం' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుకన్య స్పందించారు. చీమకుర్తి, మర్రిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో మద్యం షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం షాపుల వ్యాపారులు సమయపాలన పాటించి వ్యాపారం నిర్వహించాలన్నారు. వైన్ షాపుల వద్ద పర్మిట్ రూములను నిర్వహించవద్దని, అలాగే బెల్టు షాపులను ప్రోత్సహించవద్దని హెచ్చరించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్తంగా

ఘనంగా గానాల రామ్మూర్తి జయంతి



రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

ఒంగోలు మెట్రో: విశ్వబ్రాహ్మణ కులోద్ధారక రావు సాహెబ్ పండిత గానాల రామ్మూర్తి జయంతిని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద గానాల రామ్మూర్తి విగ్రహ ఆవిష్కరణ కమిటీ అధ్యక్షుడు వేల్పూరి రామారావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘీయులు రావు సాహెబ్ గానాల రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు వేల్పూరి రామారావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు ఒక తాటిపై నిలిచి ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. రావు సాహెబ్ పండిత గానాల రామ్మూర్తి విశ్వబ్రాహ్మణ కులానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. దానికి విశ్వబ్రాహ్మణ సంఘీయులు అందరూ సహకరించాలని సూచించారు. చిడిపోతు సుబ్రహ్మణ్యం, రావినూతల నాగేశ్వరరావు, మై కేబుల్ ఎండీ కొండూరి విశ్వసేన్, కానాల వెంకటేశ్వర్లు, కందుకూరి బ్రహ్మయ్య, కందుకూరి శ్రీనివాసచారి, పాల్గొన్నారు

శ్రామిక వర్గాల ఐక్య పోరాటాలే లెనిన్‌కు నివాళి

ఒంగోలు టౌన్: దేశంలోని శ్రామిక వర్గాలన్నీ కలిసి ఐక్య పోరాటాలు చేయడమే లెనిన్‌కు నిజమైన నివాళి అవుతుందని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచిపుస్తకం వద్ద సోషలిస్టు రాజ్య స్థాపకుడు లెనిన్ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటిగా శ్రామిక వర్గ విప్లవాన్ని విజయవంతం చేసి మార్క్సిజానికి బాటలు వేసిన మహావీరుడు లెనిన్ అని కొనియాడారు. దేశంలోని కమ్యూనిస్టులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించి వేయాలని పిలుపునిచ్చిన తొలి విప్లవకారుడు లెనిన్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు కోరారు. లెనిన్ స్ఫూర్తితో భారత దేశంలోని ఫాసిస్ట్ శక్తులను ఓడించి శ్రామిక శక్తులను బలోపేతం చేసేందుకు ఉద్యమాల బాట పట్టాలన్నారు. చుండూరి రంగారావు, కరవది సుబ్బారావు, ఏంఏ సాలార్, పిన్నిక శ్రీనివాస్, ఆవుల సుబ్రహ్మణ్యం, మస్తాన్ రావు, వీరభద్రాచారి, కత్తి కళ్యాణ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'కనక పుష్పరాగం'



కనక పుష్ప రాగం నాటకంలో ఓ సన్నివేశం

ఒంగోలు మెట్రో: స్థానిక పీవీఆర్ బాలుర హైస్కూల్లో ఎన్‌టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈదర హరిబాబు అధ్యక్షతన, కార్యదర్శి అన్నమనేని ప్రసాదరావు, ఇతర కమిటీ సభ్యుల సహకారంతో వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం సాయంత్రం కలికివాయి సాయినాథ నాదస్వర బృందంతో నాదస్వరం, ఏల్చూరు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్ మాస్టర్ సింహాద్రి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సామూహికంగా కోలాట ప్రదర్శించారు. శంకరాపురం స్కూల్ విద్యార్థులు కోలాట ప్రదర్శన చేశారు. రాత్రి విజయవాడ వారిచే ప్రదర్శించిన కనక పుష్పరాగం సాంఘిక నాటకం ఆకట్టుకుంది.

పీహెచ్‌సీల్లోనే కాన్పులు జరగాలి

ఈతముక్కల (కొత్తపట్నం): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే కాన్పులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు, మాజీ అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి కోరారు. ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కీటకాలతో వచ్చే వ్యాధులు, నీటికి సంబంధించిన వ్యాధులు, దోమలు ఉత్పత్తి కాకుండ నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో కాన్పులు జరగాలంటే ఒంగోలు హాస్పిటల్‌కు వెళ్లాలంటే రైల్వే గేటు వేసి ఆలస్యమవుతున్నప్పుడు గర్భిణులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాన్పులు స్థానిక ఆస్పత్రిలోనే చేయాలని కోరారు. కాన్పు అయ్యే వరకు డాక్టర్ల పర్యేక్షణలో ఉండాలని కోరారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి పలు సూచనలు ఇచ్చారు. రోగులకు అందించే చికిత్సలో భాగంగా పరీక్షలు నిర్వహణ, మందులు తదితర అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి సూచించారు. ఎల్‌డీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డి.శ్రీవాణి, డీపీఎంఓ డాక్టర్ వాణిశ్రీ పాల్గొన్నారు. ఈతముక్కల-2 విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను సందర్శించి పలు రికార్డులు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్.నవ్యారెడ్డి, హెచ్‌ఈవో మోహన్‌రావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

శీతాకాలంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి

పాదర్తి (కొత్తపట్నం): శీతాకాలంలో మంచు ప్రభావం, చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున రైతులు పశువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని త్రోవగుంట సహాయ సంచాలకులు డాక్టర్ బి.బసవ శంకరరావు ఆదేశించారు. మండలంలోని పాదర్తిలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బసవ శంకరరావు మాట్లాడుతూ సాధారణ వైద్య సేవలు, గర్భకోశ వ్యాధుల నిర్ధారణ, చికిత్స, చూడి పరీక్షలు, గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు, గేదెలు, ఆవులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించుట, గొర్రెల్లో బొబ్బ వ్యాధి, నిరోధక టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. శిబిరం ముందు రోజు గ్రామంలో సాయంత్రం సమయంలో దండోర వేయిస్తే పశుపోషకలకు తెలుస్తుందన్నారు. శిబిరంలో పశువులకు సాధారణ వైద్య సేవలు, 20 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 4 గేదెలకు కృతిమ గర్భధారణ, 40 గేదెలు, ఆవులకు నట్టల నివారణ మందులు, దూడలకు ఏలిక పాముల మందులు, 300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, గొర్రెలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. శిబిరంలో 45 మంది రైతులు లబ్ధి పొందారు. కొత్తపట్నం పశువైద్యాధికారి డాక్టర్ టి.అనుషా, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉడా చైర్మన్ పదవిని కాపులకు కేటాయించాలి

ఒంగోలు వన్‌టౌన్: ఉడా చైర్మన్ పదవిని కాపులకు కేటాయించాలని కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు కె.సంజీవ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని గతంలో బీసీలకు కేటాయించిన విధంగానే ప్రస్తుతం కూడా బీసీలకు కేటాయిస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారని, అదే విధంగా గతంలో ఉడా చైర్మన్ పదవిని కాపులకు కేటాయించారని, ప్రస్తుతం కూడా కాపులకు కేటాయించాలని కోరారు.